

# వాగ్దానం

బయట బ్రహ్మాండమైన శబ్దం వినిపించింది.

అంత బ్రహ్మాండమైన కల్లోలానికి ఎవరుమాత్రం అలాగే చూస్తూ వూరుకోగలరు చెప్పండి? గది లోంచి లేచి వాకిట్లో నిలబడి బయటికి చూచే సరికి కళ్లు జిగేల్‌మన్నాయి. అసలే నిద్రకళ్లేమో ఆ వెలుగును చూళ్ళేక మూసుకుపోతున్నాయి. పట్టపగల్లా వుంది మరి! ఒకప్రక్క ఆశ్చర్యం పెన వేసుకొంటూండగా ఎలాగో మూసుకుపోతున్న కళ్లకు మంత్రం పెట్టి బలవంతాన తెరిచిచూచాను. ఆశ్చర్యం! వీధంతా దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ఏమిటిదంతాను? రాత్రి నేపండుకో బోయేవరకు, అంటే ఎనిమిది గంటల వరకూ ఏమీలేదే. అప్పుడే ఎక్కణ్ణించివచ్చాయివన్నీని? అబ్బో! ఎంత వెలుగు! బాణసంచా బ్రహ్మాండంగా ధ్వనిచేస్తోంది పైకిపోయి, గుమ్మందిగి "ఏమిటిది?" చూద్దామని బయలుదేరాను.



వీధులన్నీ దీపాలతో నిండిపోయాయి. ఏ బజారుచూచినా నేలకానిసట్టు జనమే! అసలిదంతా ఎందుకు? ఇంత రాత్రివేళ ఇలా జరగడానికి కారణమేమిటి? వీటన్నిటికీ సమాధానం దొరకడంలేదు నాకు. ఒకవేపునుంచి యువకులంతా బారుగా వస్తూవున్నారు పెద్దగా అరుస్తూ.

"పదండి ముందుకు-పదండి తోసుకు
కదంత్రొక్కుతూ-పదంపాడుతూ..."

"ఎందుకండీ ముందుకుపోవడం?" అడిగాను అందులో ఒకతన్ని! అతను నన్ను గమనించనే లేదు. ఇంకొకతన్ని ఇలాగే అడిగాను.

"ఎందుకా? మరోపపంచం-మరోప్రపంచం?" అన్నాడు సాగిపోతూ ఉద్రేకంగా!

"ఎక్కడా ఆ మరోప్రపంచం?"

సమాధానం ఎవరిస్తారు? జనం కోలాహలంగా అటూఇటూ బహు హడావిడిగా తిరుగుతున్నారు. ఆ వాతావరణంలో ఎవ్వరూ నాకుమల్లే తెలియని వారు లేరు. అయోమయంగా అన్నిటివంకా చూస్తూ రెండడుగులు ముందుకువేశాను. "సుస్వాగతం" అనే బోర్డులు ప్రతివీధి చివరా - మొదటా కట్టబడివున్నాయి.

"ఎవరైనా వస్తున్నారా?" అడిగాను ఒకతన్ని. అతను నావంక ఎంత ఆశ్చర్యంగా చూచాడంటే ప్రపంచంలో ఏవిషయానికీ ఏవ్యక్తీ అంతగా ఆశ్చర్యపడడు. రెండు నిముషాలు నన్ను పైనించి క్రిందికి అవలోకించి "అంతగుడ్డిగా ఎలా బ్రతుకుతున్నావు?" అన్నాడు. నాకు మొహం తెల్లబడింది. అతనలాగే వెళ్ళిపోయాడు.

ఇంతలో మా వీధిలోనే వుంటున్న మునిసిపల్ కౌన్సిలర్‌గారు ఆదరా బాదరాగా వెళుతున్నారు శుద్ధఖద్దరు ధరించి. నాకు ప్రాణం లేచివచ్చింది. "ఏమండోయ్ ఎందుకివన్నీనూ?" అని అడిగాను.

"తినబోతూ రుచెందుకోయ్" అంటూ నేను సమీపించేలోగానే జనంలో అంతర్హితులయ్యారు.

అంతా చూడగా ఏ ప్రధానో వస్తున్నట్లుంది నాకు. అరటిచెట్లు తెచ్చి దారికిరుప్రక్కలా కట్టారు. ఏరోడ్డుచూచినా చక్కగావుంది. ప్రతి దారిలోనూ పూలుజిమ్మబడి వున్నాయి ఎత్తుగా! ఇదివరకు ఏ దారంట వెళ్ళినా మురికి కాలువ

తిరునగర్

లొంచివచ్చే దుర్వాసనతో ముక్కురంధ్రాలు పగిలిపోతూ వుండేవి కాని ఇప్పుడు ఎక్కడ చూచినా సువాసనలే! ఎక్కడవిన్నా జై, జై ధ్వానాలే! స్త్రీలంతా సింగారించుకొని పళ్ళాల్లో పుష్పఫలాదులుంచుకొని గుళ్ళకుగాబోలు పోతున్నారు.

"ఏమండోయ్. టైమెంతయింది?"

"అబ్బే ఎంతో కాలేదండి. ఇప్పుడు సరిగ్గా పదకొండూ ఇరవైనిమిషాలయింది. ఇంకా కొద్ది సేపట్లోనే అంతా జరిగిపోతుంది!" అన్నాడు నాకు దూరమౌతూ.

ఇన్ని విషయాలు నామనస్సులో అమితాశ్చర్యాన్ని కలిగిస్తూ వుండగా ముందుకుసాగాను. అసలేంజరుగుతుందో చూద్దామని! అయినా నన్ను నేను నిందించుకోక తప్పలేదు. 'ఇంతమందికి తెలిసిన విషయం నా ఒక్కడికే తెలియకపోవడమేమిటి? అది కేవలం అస్మదీయ పొరపాటుగానే ఎంచుకొని నోరుమూసుకుని వూరుకున్నాను.

సంతర్పణలు సాగుతున్నాయి. బీదజనమంతా ఎగబడి తింటున్నారు. ఓ! అడిగినవారికి లేదనకుండా దానంజరుగుతోంది. ఇంతకూ నాకో అనుమానం కలగజొచ్చింది. "అసలు ఇప్పుడు నే వున్నది మావూరేనా?" అని అయితే ఇంతకొద్ది కాలంలో ఇంతఇదిగా పరివర్తనం రావడానికి వీల్లేదే!

పిల్లికి బిచ్చంపెట్టని బుచ్చయ్యచౌదరీ దానకర్ణుడైపోయి బీదలికి సంతర్పణ చేస్తున్నాడు. రిక్షాఎక్కి మూడుమైళ్ళు తిరిగి చేతిలో అణా కాసుపెట్టే మాజీ మునిసిపల్ కౌన్సిలరు ఇప్పుడు విరివిగా బట్టలు పంచిపెడుతున్నాడు అందరికీ! ప్రపంచం మారిపోయింది. ఇది మరో ప్రపంచం గాబోలు. ఇంచాక కుర్రాడన్నమాట అర్థం ఇదే కాబోలు! రేపట్నుంచీ జీవితమంతా క్రొత్త పంథాలో నడుస్తుంది గాబోలు! తియ్యటి వూహలతో ముందుకుసాగాను.

అంతటా చలువ పందిళ్లూ వేసేశారు. హరికథా కాలక్షేపాలు, పురాణ కాలక్షేపాలు జోరుగా సాగుతున్నాయి. యువకులంతా నాటకాలు ఆడుతున్నారు. ఇవేమీ మనస్సుకిపట్టడం లేదు నాకు ఇంతలో ఎదురుగా కలకలం వినిపించింది. అబ్బో లెక్కకు మీరిన జనసమూహం ఎదురుగుండా వస్తోంది. ముందు బ్రాహ్మణోత్తములు వేదపఠనం చేస్తున్నారు. దానివెనుక బ్యాండుమేళం అపూడేట్ న్యూ సినిమాసాంగ్సు బ్రహ్మాండంగా వాయిస్తోంది. దానితరువాత వందిమాగదులు జయజయధ్వానాలు చేస్తున్నారు. వందిమాగదులవెనుక ఓ పెద్ద రథంలో ఓచక్కని సుందర ముఖవర్చస్సుగల యువకుడు కూర్చుని వున్నాడు. వేషం నవనాగరికంగా వుంది. బుష్ కోటుపైన సనాతన గుళ్ళు, నవీనులు క్రాపింగు బొమ్మలూ వున్నాయి. ప్రపంచంలో అన్నివస్తువుల బొమ్మలూ చక్కగా చిత్రించారు బుష్ కోటుమీద. అతని ముఖంమీద చిరునవ్వు చిందుతోంది. కారుణ్యం వర్షిస్తోంది.

"జై మిష్టర్ ఫోర్ కీ... జై!"

గుంపుసాగిపోయింది. వెనుక జనసమూహాన్ని లెక్కించడం చిత్రగుప్తుడితరం గూడా గాదు. ఒకవేళ అతనే ఈ దృశ్యాన్ని చూస్తే ఖాయంగా తన చిట్టాలెక్కలన్నీ తప్పనుకుంటాడు! నా వెనుక నిలబడ్డవాళ్ళంతా నన్ను తోసుకొంటూ వెళ్ళి జనంలో కలిశారు

అంతా వెళ్ళిపోయారు. వెనుక మాసిపోయిన గడ్డంతోనూ, చిరిగిపోయిన గుడ్డలతోనూ ఓ వ్యక్తి ఆయాసపడుతూ వస్తున్నాడు. పాపం బాగా వయసొచ్చేసింది. అట్టే పరిశీలించిచూస్తే అతనొకప్పుడు మంచి వైభవాన్ననుభవించిన వ్యక్తేనన్న విషయం జ్ఞేయమౌతుంది.

"ఏమిటబ్బాయ్ ఇంకా నువ్విక్కడే నిలబడ్డావు?" ప్రశ్నించాడు చివరనుపడ్డ నన్నుచూచి!

"అసలిదంతా ఎందుకో కాస్త చెపుతారూ?" అడిగాను జాలిగా! అతనిధోరణి చెప్పేటట్లుగానే వుంది.

"ఓయి పిచ్చివాడా ఇంకా నీకు తెలియదన్నమాట! మీరంతాకలిసి మిష్టర్ "ఫోర్"ని ఎన్నుకున్నారుగా! నేనెవరినంటావేమి? మీకోసం నా జీవితాన్నంతా వెచ్చించి, చివరికి లావార్థక్యంలో పడిపోయాను. నా పేరు "మిష్టర్ త్రీ". ఏమిటో మీరంతామంచివాళ్ళే ఎటొచ్చీ మేమే వట్టి పిచ్చివాళ్ళం; మిష్టర్ 'టూ' వెళ్లిపోతున్నప్పుడూ నాకు వీళ్ళంతా మిష్టర్ ఫోర్ని ఆహ్వానించినట్లే ఘన

స్వాగతం ఇచ్చారు. కాని ఆ చేతులతోనే నన్నిప్పుడు వట్టి అసమర్థుణ్ణిగా తోసేస్తున్నారు! ఫోర్ ని ఆహ్వానిస్తున్నారు. బహుశా అతనూ మొదట నేననుకున్నట్లే అనుకుంటాడు; తనని ప్రజలెంతో మెచ్చుకుంటున్నారని; కాని అతనికీ ఒకప్పుడు ఈ నిందే మోయవలసి వుంటుందని తెలీదు. పాపం! నిట్టూర్చాడు నిరాశగా వృద్ధుడు!

"అది యువకతత్వం లెండి! అయినా ప్రపంచంలో దేనికిమాత్రం నిర్దిష్టత వుందిలెండి. ప్రతీదీ చంచలత్వానికి లొంగిపోవలసినదే!" ఓదార్పుగా అన్నాను.

"అంతే ననుకో! కాని చివరికి ప్రజలచేత మన్నన పొందలేకపోయాను. ఇన్ని చేసినా నన్నెవ్వరూ గుర్తించకపోవడం బాధగావుండదూ?" పాపం తన స్థితి అనంతటినీ ఏకరువు పెడుతూ అన్నాడు. అతను నడుస్తూనే వున్నాడు. నేను అతన్ని అనుసరిస్తూనే వున్నాను. ఒక చోట నడుస్తున్న గుంపంతా ఆగిపోయింది. పెద్ద సభ ఏర్పాటు చెయ్యబడివుంది. గేటుపైన పెద్దబోర్డు కట్టివుంది "1954 సంవత్సరానికి స్వాగతం" అని.

మిష్టర్ "త్రీ" "వస్తానోయ్. నా చివరికర్తవ్యాన్నిగూడా పూర్తిచేసి పోతాను" అంటూ వెళ్ళిపోయాడు. మిష్టర్ ఫోర్ అధ్యక్షపీఠాన్నలంకరించారు. మెడంతా పూలదండలతో నిండిపోయివుంది. మెడత్రిప్పడానికి వీలులేకుండా వుంది.

మా పురప్రముఖులంతా ఒక్కొక్కరేవచ్చి స్వాగతపత్రాన్ని చదివారు. మునిసికల్ చైర్మన్ మునిసిపాలిటీనిగురించి చెబుతూ "మునిసిపాలిటీకి చాలాజరగవలసిన వున్నాయనీ, అవన్నీ జరిగిపోయిన సంవత్సరంలో వెనకబడిపోయాయనీ, ఏ మాత్రమూ జరగలేదనీ, అన్నిటినీ పూర్తిచేసే బాధ్యత మిష్టర్ ఫోర్ గారిమీద వుందనీ గనుక ఫోర్ గారిని దేవుడు వెయ్యికళ్ళతో చూస్తూ సర్వ సంపదలూ ఇచ్చి రక్షించుగాక!" అనీ చదివి కూర్చున్నారు. జరగవలసిన ఎన్నెన్నో వున్నాయనీ వాటినన్నిటినీ నిర్విఘ్నంగా ఫోర్ గారు కొనసాగిస్తారని తా నాశిస్తున్నాననీ" అన్నారు.

సరే! ఇక కార్యక్రమం ప్రారంభించబడింది. మిష్టర్ ఫోర్ లేచి "ఇప్పుడు మాజీ ప్రెసిడెంటు మిష్టర్ త్రీగారు తాముచేసిన కార్యక్రమమంతా సింహావలోకనం చేస్తారు" అని కుర్చీలో కూర్చున్నారు.

మిష్టర్ త్రీ మైక్ ముందు నిలబడి తనను తాను సర్దుకున్నాడు. "మహాజనులారా! నాకింక అట్టే వ్యవధిలేదు. వెళ్ళిపోవాలి. వెళ్ళే ముందు మీకొక్కటి చెపుదామని వుంది. నన్ను మీరు ప్రేమించకపోయినా- నేను ప్రతిపనీ మీ మేలు కోసమే చేశానని ఆత్మసాక్షిగా చెపుతూ కనీసం ఆ విషయాన్ని నమ్మమని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను."

"వట్టి అబద్ధం! వట్టి అబద్ధం" అంటూ సభలో కేకలు.

"మీరలా అనకండి! మీకేం చెయ్యలేదు? మీరు తరతరాలనుంచీ కొట్టుకుచచ్చినా రాని రాష్ట్రం నేతెచ్చిపెట్టాను" అన్నాడు మిష్టర్ త్రీ తను చేసిన సేవను ఎలాగయినా ప్రజలచేత గుర్తింపచెయ్యటానికి!

"నీసేవ మండినట్లేవుంది." సభలో ఓమూల నుంచి వచ్చింది.

"ఓ! మీకింకా తృప్తిగాలేదా?" ప్రశ్నించాడు సభికుల్ని మిష్టర్ త్రీ.

సభ మధ్యలోంచి ఒకతను లేచి నిలబడి, "నీకెలా నోరు వస్తోంది అలా అనడానికి? రాష్ట్రం రాష్ట్రం అంటావుగాని దానికి రెట్టింపైన విలువగల నిండుప్రాణం ధారపొయ్యలేదా? నీ గొప్పేవిటి? ఒకవేళ రాష్ట్రం ఇచ్చారయ్యా! ఏమిటీ రాష్ట్రం? ఎందుకూగానిది రాకుండా వున్నా బాగుండేది" కూర్చున్నాడతను.

"ప్రజలారా! మీరలా అన్నా నాకేమీ బాధ లేదు. నన్ను ఓ మంత్రి ఎంతగా పొగిడాడో మీకెలా తెలుస్తుంది?" ఎలాగయినా తనగొప్పదనాన్ని ప్రజలచేత ఒప్పించాలని పాటుపడుతున్నాడు వృద్ధుడు.

"నా దగ్గరికి తీసుకురా అతన్ని. ఎలా అన్నాడో కనుక్కుంటాను, గుడారాల్లో గూని బ్రతుకు బ్రతుకుతూ నిన్ను మెచ్చుకున్నాడూ? హాయిగా రాజభవనాల్లో వుండలేక ఆ గుడారాల్లో బ్రతుకే హాయిగా వుంది గాబోలు" సూటిగా ఎదురొక్కంది ప్రశ్నని.

"అలా అంటే నేను గుండెపగిలి ఛస్తాను. మీకోసం ఎంత కష్టపడ్డానో చూడండి. మీ బెజవాడలో లయోలా కాలేజీని పెట్టడానికి ఏర్పాటు చేయించి శంకుస్థాపనగూడా జరిపించానా?..." ఇంకా మాట పూర్తికానేలేదు ఎవరో అందుకున్నారు "మహా పాటుపడ్డావులే నీ గొప్ప ఎవరికి తెలీదు? గోదావరి పొంగి సర్వనాశనంచేసింది. ఇంకా పెద్ద కష్టపడ్డానని చెబుతావేమిటి? అంత నష్టం మా ఆంధ్రరాష్ట్రానికెప్పుడైనా వచ్చిందా?" సూటిగా ప్రశ్నించాడు మిష్టర్ త్రీని పట్టుకొని.

"చెబుతా...చెబుతా..."తడబడుతున్నాడు పాపం మాట పెగిలిరాక.

"నువ్వుదిగూ....నువ్వుదిగూ"అంటూ సభలో కేకలు.

"మిష్టర్ త్రీ" అసహాయశూరుడై క్రిందికి దిగిపోయాడు.

"మిష్టర్ ఫోర్"గారు లేచి నిలబడి "మహాజనులారా నాకిచ్చిన ఘనస్వాగతానికి మీకందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. మిష్టర్ త్రీవలె గాకుండా నా సాయశక్తులా మీగురించి కష్టపడి మీ కోర్కెల్ని సఫలం చెయ్యడానికి ప్రయత్నం చేస్తూ సర్వకాల సర్వావస్థలయందు మీ క్షేమంకోసమే పాటుపడతాను.

"జై స్వతంత్రభారత్ కీ!...జై."

"మాకు శాశ్వత రాజధాని మాకు కావలసిన చోటే పెట్టించాలి!"

"తప్పకుండా ప్రయత్నం చేస్తాను."

"హైదరాబాదుతో సహా విశాలాంధ్ర ఏర్పరచాలి!"

"మీ సహకారంవుంటే తప్పక అలాగే జరుగుతుంది."

"జై మిష్టర్ ఫోర్ కీ!" జయజయ ధ్వానాలతో ఆ ప్రదేశం మారుమ్రోగింది.

నాకు ఒకటి అడగాలనిపించింది మిష్టర్ ఫోర్ని "ఏమండోయ్ ఒక్కమాట! మా యింటిముందు మానవమాత్రులకు సహ్యంకాని వాసన-మురుగు కాలవ వాసన-అది కాస్తా పోయేటట్లు అనుగ్రహించాలి."

"కూర్చో! కూర్చో!" అంటూ వెనక నిలబడ్డ మునిసిపల్ కౌన్సిలర్ గారి బావమరిది బుజంమీద చెయ్యివేసి వంచి కూర్చోపెట్టాడు ఆ కలకలంలో నా కేక మిష్టర్ ఫోర్ కి వినిపించనేలేదు. వంశీమాగధుల బృందం భట్రాజు పొగడ్త మొదలుపెట్టింది!

"ఏమిట్రా బాబూ. ఇక్కడ ఎలా బ్రతుకుతున్నావోరా నాయనా" అంటూ మిత్రుడు శ్యామలరావు దుప్పటిలాగేశాడు.

"ఆ" అంటూ లేచాను. ప్రక్కనున్న మురికి కాలవ ముక్కు బద్దలు చేస్తూంది!

## తమరు పరాకు చిత్తగిస్తున్నారు!

గుంటూరునుండి వెలువడే 'ప్రజావాణి' వారపత్రిక జనవరి 24, 1954 సంచికలో "సందేహాలు:సమాధానాలు" అన్న శీర్షిక క్రింద ప్రచురించిన ఒక అంశం:

ప్ర: గుడిపాటి వెంకటచలం అరవిందయోగి ఆశ్రమంలో ఎందుకుంటున్నాడో వ్రాస్తారా? తన పుస్తకాలద్వారా యువకుల్లో మార్పు తీసుకొనివచ్చి తను సన్యాసైపోవటంలో ఆయన ఉద్దేశమేమైయుండును? భగవంతుడు ఉన్నాడని ముసలితనంలో తెలుసుకున్నాడా? ఆయన అడ్రసు తెలుపుతారా?

స: బహుశా జ్ఞానవిద్యార్జనకోసం శ్రీ గుడిపాటి వెంకటచలం అరవిందాశ్రమానికి వెళ్ళి ఉంటాడు. సంఘ సంస్కారాభిలాషకలవాడు గనుకనే ఆయన తన రచనలద్వారా యువకులలో మార్పు తీసుకువచ్చాడు. ఐహిక సుఖాలు తలమున్కలుగా అనుభవించిన తరువాతనే ఆయన తత్వ జిజ్ఞాసాపరుడై ఉంటాడు. ఆయన జ్ఞానసంపన్నులందరివలెనే సహజ పరిణామమే పొందాడు. "కామిగానివాడు మోక్షకామిగాడు"అని పూర్వమే వేమనయోగి చెప్పిఉన్నాడు గదా! ఆయన అడ్రసు గుడిపాటి వెంకటచలం, కేర్ ఆఫ్ అరవిందాశ్రమం, పుదుచ్చేరి.

సంపాదకుల సర్వజ్ఞత్వయుతమైన సమాధానానికి కృతజ్ఞత. ఒక్కవిషయం మాత్రం సంపాదకులకు తెలిసినట్టులేదు: చలంగారు తొలినుండీ ఉంటున్నది తిరువణ్ణామలైలోని రమణమహర్షిఆశ్రమంలో.